


# గాడ్ ఫాదర్

ప్రియదర్శినీ యల్లాప్రగడ



బహుశా నాన్నకి నడుమంత ఎత్తుంటానేమో– నాన్న చెయ్యి పట్టుకుని, అలా తోటలోకెళ్లి, తోటలోవున్న పొలాల గట్లమీద నాన్నతో నడవటమన్నది ఎంత నిశ్చింతగా వుండేది! పొలాల గట్లమీద ముందు నాన్న... ఆయన వెనక నేను నడుస్తూంటే అంతదూరాన వున్న గుబురు మొగలిపొదని వేలితో చూపిస్తూ ''చూడమ్మా కాంచీ... నువ్వెప్పుడూ ఒక్కదానివే ఈ పక్కకు రాకూడదు... ఒకవేళ అక్క– అన్నవాళ్లతో వచ్చినా పొరపాటుగా కూడా అదిగోచూడు... ఆ మొగలిపొదవైపు వెళ్లకూడదు''

''ఎందుకునాన్నా?''

''అందులో పెద్దపెద్ద తాచుపాములున్నాయమ్మా.... దగ్గరకెళితే కరుస్తయ్...'' ఏదో చెబుతున్నారు నాన్న... ఇప్పుడు లీలగా గుర్తొస్తూన్నది. ఆ నాగుపాముల్లో ఒకపాము రోజూ ఉదయానే సూర్యనమస్కారాలు చేసేదట... నాన్న చెప్పటమేగాక వూళ్లోవాళ్లు కూడా అనుకునేవాళ్లు



## మనవాళ్లు పేద్ద స్టార్‌లోయ్...

ప్రపంచ సినిమా తెరమీద మన బాలీవుడ్ తారల ప్రభంజనానికి మెల్లిగా తెరలేస్తోంది. ఐశ్వర్యా రాయ్ 'చావోస్' సినిమాలో మెరిల్ స్ట్రీప్‌తోనూ, 'సింగులారిటీ' సినిమాలో బ్రెండన్ ఫ్రేసర్‌తోనూ నటిస్తోంది. ఆవిడ బాయ్‌ఫ్రెండ్ వివేక్ ఓబెరాయ్‌కి రోలాండ్ జాఫీ 'ది ఇన్వేడర్స్' లో ఆఫర్ వచ్చింది కానీ ఇంకా ఖరారు కాలేదు. ఐషూ జానీ దుష్మన్ సల్మాన్ ఖాన్, సర్క్యూట్ అర్షాద్ వార్సి 'మేరీగోల్డ్' సినిమాలో చేస్తున్నారు. హృతిక్‌రోషన్‌కి కూడా తర్సెమ్ సింగ్ సినిమా 'హేమ్లెట్'లో ఆఫర్ వచ్చింది కానీ ఎందుకనో తిరస్కరించాడు. నసీరుద్దీన్ షాకు 'ది లీగ్ ఆఫ్‌ది ఎక్స్‌ట్రాడినరీ జెంటిల్‌మెన్'సినిమాలో మాంఛి వేషం దొరికింది. బ్లేక్ ఎడ్వర్డ్ తీస్తున్న 'ది రిటర్న్ ఆఫ్‌ది పింక్ పాంథెర్' సినిమాలో షబనాది పెద్ద వేషం. 'స్టార్‌వార్స్- ఎపిసోడ్ 2' లో మన ఆయేషా ధార్కర్‌ది చిన్నవేషమేకానీ ప్రాధాన్యత వున్నది.

---

కరణంగారు... అచ్చింతరామయ్యగారి తోటలోవున్న నాగుపాము సూర్యనమస్కారాలు చెయ్యటం మా కళ్లారా చూశామని.

నాన్న పాముల కబుర్లు చెబుతూ పొలంలో వున్న నీటిదొరువుదగ్గర ఆగి, ఒక్కసారి నా వంక చూశారు వెనక్కి తిరిగి, "ఏంటమ్మా... ఏం మాట్లాడవు... అర్థమైందా నేను చెప్పింది?" అడిగారు.

మౌనంగా తల అటూ ఇటూ తిప్పి, నాన్నకి దగ్గరగా నడిచి, ఆయన మోచేతిని నా రెండు చేతులతో పట్టుకుని "నాన్నా... ఇవాళ ఏమయిందో తెలుసా? లలితత్తయ్య వున్నదే బెజవాడ నుంచీ వచ్చింది పొద్దున? ఆవిడ ఏమన్నదో తెలుసా నన్ను?" బుంగమూతితో నాన్న కళ్లలోకి చూశా.

"ఏమన్నదమ్మా?" అనునయంగా చూస్తూ అడిగారు నాన్న.

"ఏయ్ నల్లదానా... ఇంకా నువ్విక్కడే వున్నావటే తోట్లోవున్న మీ అమ్మానాన్నల దగ్గరకెళ్లకుండా? ఇక్కడేంపని నీకు?" అని అడిగింది నాన్నా- నాన్నతో చెబుతూంటే నా కళ్లలో నీళ్లు బుగ్గలమీదికి వాగుల్లా జాలువారాయి.

"ఛా... ఛా... ఆ లలితమ్మకి అసలు బుద్ధి లేదమ్మా... అత్తయ్య అలాగే అంటుంది తమాషాకి.... నువ్వు మనతోట్లో వున్న ఆ యానాది దుర్గి, ఎంకడి కూతురివి కాదు తల్లీ... వాళ్లు నిన్ను వూరికే ఏడిపించటానికలా అంటారు... నువ్వు అలాంటి మాటలనెప్పుడు విన్నా పట్టించుకోకూడదు." అంటూ నన్ను ఎత్తుకుని, నా కళ్లు ఆయనచేత్తో తుడిచి, నా బుగ్గమీద సుతారంగా ఓ ముద్దు పెట్టుకున్నారు నాన్న.

"లలితత్తయ్యే కాదు... ఈ వూళ్లో చాలామంది నన్నలాగే అంటారు- నేను యానాది దుర్గివాళ్ల పిల్లనట గదా? పసిపిల్లగా వున్న నన్ను మామిడి చెట్టుదగ్గర వదిలేసి వెళితే, తాతయ్యగారు నన్ను చూసి నీకూ, అమ్మకీ ఇచ్చి పెంచమన్నారట గదా?" ఏడుస్తూనే అడిగాను.

"చూడు కాంచీ... నువ్వెప్పుడూ ఈ విషయాన్ని మనసులోకి రానివ్వ కూడదు. ఇంట్లో అందరూ తెల్లగా వుండి, నువ్వొక్కదానివే కాస్త రంగు తక్కువగా వుండేసరికి నిన్ను సరదాగా ఆటపట్టిస్తారు- అవన్నీ పట్టించుకో వద్దు తల్లీ. నువ్వు నా బంగారు తల్లివి కదూ!" అంటూ నాన్న నన్ను చాలా సేపు బుజ్జగించారు ఆ దొరువు దగ్గర.

"గుడిలో వున్న నరసింహస్వామి మీద ఒట్టేసి చెప్పు..."

"ఒట్టు... ఆ దేవుడిమీద... మా అమ్మమీద..."

"నా మీద?"

"నీ మీద కూడా..." అని ఆయన చెప్పగానే అప్పటికి గానీ నా అనుమానం తీరలా. అంతకు ముందు నిజంగానే తోటలో పనివాళ్లు దుర్గి, వెంకడి కూతుర్నన్నే భావన నాలో వుండి, ఇంతమంచి అమ్మా నాన్నకి నేను సొంతకూతుర్ని కాలేదే అని చాలా దిగులు పడటమే కాకుండా, నా ఒంటి నల్లరంగు చూసుకుని చాలా కుమిలిపోయేదాన్ని అక్కయ్యలంత అందంగా లేనే అని.

నాన్న ఆ విషయాన్ని జాగ్రత్తగా మరలించారు. పొలంగట్టు నుంచీ తోటలో వున్న జామ, మామిడి చెట్లదగ్గరకి తీసుకొచ్చారు నన్ను. ఆ చుట్టు పక్కలన్నీ చెట్లే. నేరేడు... జామ... సపోటా... మామిడి... జీడిమామిడి... నారింజ... దానిమ్మ... సీతాఫలం- ఎన్నెన్నో. మాతోటంటే నాకు చాలా ప్రాణంగా అనిపించేది చిన్నప్పుడు..., ఇప్పుడు కూడా.

"ఒరేయ్ రామాయ్... ఎవర్రా- దా... ఇట్రా... ఇదుగో అర్జంటుగా మా కాంచనమ్మకి తేగలు తీసి, కాల్చిపెట్టు-" అంటూ వాడిని పురమాయించారు. వాడు ఒక గంటలో గబగబా తేగలు పాతరలోంచీ తీసి, వాటిని ఇసుకలో చక్కగా నిలబెట్టి, తాటాకులు బాగా ఎండిపోయినవి తెచ్చి, ఆ తేగల్ని బాగా కాల్చి, తొక్కుతీసి, దానిలో వున్న చందమామను అవతల పారేసి, మంచిమంచివీ... పెద్దపెద్దగా వున్న తేగముక్కల్ని నాకు ఇచ్చాడు. దాంతో నాకు ఎక్కడలేని ఆనందం వేసింది నాన్న ప్రేమకి పాత్రురాలిని అవటం వల్ల...నాన్నకి నేను సొంతకూతుర్నన్నే నమ్మకం కలగటం వల్ల.

* * *

నాన్న ఇక లేరన్న చేదు నిజాన్ని జీర్ణించుకోవటం కాంచనమాలకి చేతకావటంలా ఆ కబురందిన్పటి నుంచీ. ఆమె గుండెలు బద్దలైపోతున్నాయి. ఆఫీసులో వున్న భర్తకి ఫోన్ చేసి ఈ వార్త చెప్పింది. విన్న అతను హుటాహుటిన కూతురు స్కూలు కెళ్లాడు. ఆమెతోబాటు ఇంటికొచ్చాడు. గబగబా అన్ని సామాన్లూ కారులో కుక్కేశారు పనివాళ్ల సాయంతో. ఎక్కడ చెన్నై... ఎక్కడ అల్లూరు! ఎంతలేదన్నా ప్రయాణానికి కనీసం పన్నెండు గంటలు పడుతుంది. బయలుదేరారు ముగ్గురూ కార్లో.

* * *

ప్చ్... నాన్న నా చిన్నప్పుడు మా అందరికీ ఎంతబాగా తెచ్చేవాళ్లు చెప్పులు- జమాబందికోసం బాపట్ల వెళ్లినప్పుడు తప్పకుండా మా అందరికీ చెప్పులు తెచ్చేవాళ్లు. నాన్నకోసం... నాన్నతెచ్చే వస్తువుల కోసం మేం పిల్లలమంతా ఎంత రాత్రయినా కాచుక్కూర్చునేవాళ్లం. బాపట్ల వెళ్లే ముందు అన్నయ్య, అక్కలు, చెల్లి, తమ్ముడు, నాకు – అందరిదగ్గరా ఒక్కో తెల్ల కాగితం మీద ఒక్కోజత కాళ్ల అద్దులు గీసి, ఆ తెల్లకాగితం వెనకాల ఎవరికాళ్ల అద్దులయితే వాళ్ల పేరు రాసుకునేవాళ్లు. నాన్న రావటానికి చాలా పొద్దుపోయేది. చాలా పొద్దు పోయేదంటే హీనపక్షంలో రాత్రి పదిగంటలు. ఆ రోజుల్లో రాత్రి పదిగంటలంటే మా పల్లెటూర్లో చాలా పొద్దుపోయినట్లే అర్థం. నాన్న ఇంటికొచ్చి తను తెచ్చిన బాగ్‌లన్నింటినీ అమ్మకిచ్చేవాళ్లు. మేమందరం ఆ బాగ్‌లని అమ్మదగ్గర నుంచీ లాక్కుని, ఎవరి చెప్పులు వాళ్లం తీసుకునేవాళ్లం. ఒక్కోసారి బూట్లుకూడా తెచ్చేవారు నాన్న. వాటితో బాటు బ్రిటానియా బిస్కట్లూ... మలబార్ సబ్బులూ... మైసూర్ శాండల్ సబ్బులూ... మోతీ సబ్బులూ.... చార్మిస్, క్యూటికురా పౌడర్లు- ఇవీ నాన్న తెచ్చే వస్తువులు. ముఖ్యంగా బాపట్లనుంచీ అమ్మకి ఒక్కోసారి పారగాన్ చీరలు కూడా

తెచ్చేవాళ్లు. వీటన్నింటినీ మేమెంతో గొప్పగా భావించుకునేవాళ్లం ఆ రోజుల్లో. ఎందుకంటే ... కుగ్రామమైన అల్లూరులో చెప్పులూ, బూట్లూ వేసుకోవటంగానీ... ఇలాంటి మంచి మంచి సబ్బులూ, పౌడర్లూ వాడటం గానీ చాలా పెద్ద విషయం. అక్కడ అందరూ కాళిదాసు కొట్లో మల్లెపూల (లక్స్) సబ్బో లేక పాండ్సు పౌడరో... గుడ్డల సుబ్బులు కొట్లో దొరికే చీటీ గుడ్డలో తప్ప ఇంకొకటి ఎరగరు. ఊళ్లో అందరికీ నాన్న తెచ్చే వస్తువుల మీద తగని మోజు. ''కరణంగారు... అచ్చింతరామయ్యగారు టౌనుకెళ్లి, భార్యాపిల్లలకి బలేబలే వస్తువులు తెస్తుంటారు-'' అంటూ విచిత్రంగా చెప్పుకునేవాళ్లు. నాన్న పేరు అచ్యుతరామారావు అయినప్పటికీ అల్లూరులో ఏమనిషీ ఆయన్ని పూర్తి పేరుతో పిలవరు. అందరూ ఆయన చేసే వుద్యోగంతో సంబోధిస్తూ కరణం గారనో... అచ్చింతరామయ్యగారనో... అచ్చితరావు గారనో పిలిచేవారు.

నాన్న పాటలు చాలా బాగా పాడేవాళ్లు. 'ఏకాంతమూ సాయంత్రమూ...' అంటూనో 'ఎంత ఘాటు ప్రేమయో' అంటూనో 'పెనుచీకటాయే లోకం' అంటూనో ఎప్పుడూ ఏదో ఒక పాట పాడుతూనే వుండేవారు హుషారుగా... ఇల్లంతా తిరుగుతూ. నాన్న చిన్నప్పుడు 'మాలపిల్ల' అనే సినిమాలోకూడా నటించారట అల్లూరు నుంచీ చెన్నపట్నం వెళ్లి. మాలపిల్లలో నటించిన విషయం తెలుసుకున్న తాతయ్యగారు చెన్నైవెళ్లి, నాన్నని చింతపరికెతో కొట్టుకుంటూ అల్లూరు తెచ్చేశారట మనలాంటి వాళ్లకి సినిమాల్లో వేషాలేసే ఖర్మేంటని. ఆ సినిమాలో హీరోయిన్‌గా వేసిన కాంచన మాలంటే నాన్నకెంతో ప్రాణం. ఆమెని నాన్న 'అక్కయ్యా' అని పిలిచేవాళ్లట- ఆవిడ నాన్నకంటే కనీసం పది సంవత్సరాలయినా పెద్దదేమో... ఎందుకంటే మాలపిల్లలో నటించినప్పుడు నాన్న వయసు చాలా చిన్నవయసు. ఆవిడ అప్పటికే హీరోయిన్. ఆవిడ కూడా నాన్నను 'అచ్చూ... అచ్చూ' అని సొంత తమ్ముడిలా చూసుకునేదట. నేను పుట్టినప్పుడు అందుకే నాన్న ఆవిడ పేరును నాకు పెట్టుకున్నారు.

* * *

అల్లూరులో ఇంటిముందు కారాగింది. దిగారు ముగ్గురూ. అప్పటికే అత్తయ్యలూ, వాళ్ల పిల్లలూ... బాబాయిలూ, వాళ్ల కుటుంబాలూ... మామయ్యలూ, వాళ్ల కుటుంబాలూ, అక్కలూ, బావలూ అందరూ వాళ్ల వాళ్ల వూళ్ల నుంచీ వచ్చి కనిపించారు కాంచనమాలకి. ఎవరి మొహంలోనూ జీవం కనిపించలా. గబగబా ఇంటిలోపలికెళ్లింది. కూతుర్ని చూసిన తల్లి శారదమ్మ బావురుమంది. ఆ సాయంకాలమే ఆయన్ని తీసికెళ్లారట క్రితంరోజు ఏకాదశి నాడు పోయినాయన్ని ద్వాదశినాడు దహనం చేస్తే మంచిదని. తండ్రిలేని ఆ ఇల్లు రాజులేని కోటలా... పాడుపడిపోయినదానిలా కనిపించింది కాంచనమాలకి. ఎక్కడ చూసినా వెలితిగా ప్రాణం లేనట్టుగా అనిపించింది. ఆమె రాకతో మళ్లీ ఆ ఇల్లు మరణ శోకంతో మారుమోగింది. ఆ విలాపాలకి మృత్యు దేవత మురిసిపోయింది. కనీసం ఆఖరి చూపు కయినా నోచుకోలేకపోయినందుకు ఆమె మనస్సు ముక్కలయింది.

తెల్లారింది... మళ్లీ మరో శోకదినానికి నాంది పలుకుతూ. పెరట్లోకెళ్లింది కాంచనమాల పళ్లు తోముకుందామని. అక్కడున్న ఆ సపోటా చెట్టు ఇంకా అలాగే వుంది. చిన్నప్పుడు.. మళ్లీ జ్ఞాపకాల వలయంలో చిక్కుకుపోయింది కాంచనమాల.

* * *

అప్పుడు నేను చాలా చిన్నపిల్లని... బహుశా ఐదారు సంపత్సరాలుంటాయేమో. చెట్టుకు సపోటా కాయలు లేకపోయినా తోచక... సరదాగా సపోటా చెట్టెక్కాను. అట్లాంటి మొరటుపనులు ఆడపిల్లల్లో ఇంట్లో నేను తప్ప ఇంకెవ్వరూ చెయ్యరు. నా మొరటు పనులతో ఇంట్లో అందరూ విసిగిపోయారు కూడా. చెట్టెక్కిన నాకు పడబోతూన్నట్టు తెలుసు... అంతే- తీరా కళ్లు తెరిచి చూసే సరికి నేను పడుకుని వున్న నవారు మంచం చుట్టూ అమ్మా, అక్కలు, అన్నయ్య, తమ్ముడు, చెల్లెలు అందరూ ఆందోళనగా కనిపించారు... నాన్న దూరంగా చేతిలో మెటీరియా మెడికా... హోమియో మందుల పుస్తకాన్ని చదువుతూ కనిపించారు. ఆయన మొహం చాలా గంభీరంగా వుంది. కళ్లు తెరచి ఆయన్నే చూస్తూ పడుకున్నాను. ఛడా మడా తిట్టారు నన్ను... ఒకపక్క అమ్మ వారించుతున్నా నాన్న మటుకు వూరుకోకుండా బాగా మంగళహారతులు పెట్టారు. ఒకపక్క పడీ, దెబ్బ తగిలి నేను బాధపడుతూంటే నాన్న నన్నెందుకు తిడుతున్నారో ఆ రోజు అర్థంకాలా. అది కన్నప్రేమని నా కూతురు పుట్టటంతో తెలిసింది నాకు. పాపం... నాన్న ఆరోజంతా ఏవేవో హోమియోమందులు ప్రతి

## కండల రాణులు

'**ధూమ్**' సినిమా రష్ చూసిన సినిమాజనం గరమ్ ధరమ్ కూతురు ఇషా గురించి ఒకటే చెప్పుకుంటున్నారు. ఆ సినిమాలో ఇషాతోపాటు రిమ్మిసేన్‌కూడా అదిరిపోయే ఫిగర్‌తో కనిపించారట. ఇప్పుడు బాలీవుడ్‌లో కొత్త గాలి వీస్తోంది. బాడీఫిట్‌నెస్ అదివరకటి మాదిరి కేవలం హీరోలకే పరిమితం కాదు. కుర్రహీరోయిన్‌లుకూడా రోజు జిమ్‌కి వెళ్లి వ్యాయామం చేస్తున్నారు. అదీ గంటలతరబడి. ఇంకొంతమంది నాట్యాన్ని ఆశ్రయిస్తున్నారు. ఇషా, రిమ్మిలకు ఫిట్‌నెస్ ట్రైనర్ షేర్‌వీర్ వకీల్. గర్వ్ సినిమాలో కూడా శిల్పాశెట్టి తీగలా కనిపించింది. తను లీనా మొగ్రే దగర ట్రైనింగ్ తీసుకుంటోంది. అంత్రా మాలి శరీరం గాయబ్ లో ఎంత బిర్రుగా వుందో చూశారుగా... తనకు గురువు ఫ్రాన్సిస్ ఫెర్నాండెజ్. రమా బన్స్, డేన్ పాండే, వృందా మెహతా... వీళ్లంతా ఇప్పుడు బాలీవుడ్‌లో ఫిట్‌నెస్ గురూలు...



గంటకీ నా నోట్లో వేస్తూనే వున్నారు. ఆ సంఘటన అలా జరిగిపోయి, ఒదిగిపోయింది కాలగర్భంలో. పళ్లు తోముకోవటం ముగించిన నేను ఇంటిబయట వరండాలో కుర్చీలో కూర్చుని కాఫీ తాగుతూంటే నా దగ్గరకే వస్తూ కనిపించింది సుబ్బారావు. అదే... కుక్క! చిన్నప్పుడు మా ఇంట్లో ఎప్పుడూ ఒక వూరకుక్క తప్పనిసరిగా వుండేది మాలో ఒక సభ్యురాలిగా. ఆ కుక్కకి సుబ్బారావనే పేరు తప్పనిసరి. ఎన్ని కుక్కలు మారినా సుబ్బారావు పేరు మాత్రం మారేది కాదు. దానికి యజమాని అన్నయ్య.

ఆ రోజున ... మధ్యాహ్నం సమయం. నాన్నకి భోజనం చేసిన తరువాత ఒక గంట పడుకునే అలవాటు. ''కాంచీ... కాస్త కాళ్లు నొక్కమ్మా'' అన్నారు. ఇష్టం లేకపోయినా వూరికే నాన్న కాళ్లని చేతివేళ్లతో వీణని మీటినట్లు మీటేదాన్ని కాళ్లు నొక్కటం ఇష్టంలేక. అసలు నాన్న ఎప్పుడు కాళ్లు నొక్కమని పిలిచినా నేను చేసేదదే నాన్నమీద మండి. ఆ రోజూ అలాగే. నాన్న పడుకున్నారు... నేను ఆయన కాళ్లతో ఆడుతూ కూర్చున్నా. నాన్న నిద్రలోకి మునిగిపోయారని అర్థమై నెమ్మదిగా లేచా పిల్లిలా. బయట వరండాలోకెళ్లా. అక్కడొక కుక్క నిద్రపోతూ కనిపించింది. సుబ్బారావు కాదు వేరే కుక్క. నెమ్మదిగా దాని దగ్గరికెళ్లా... పూచికపుల్లతో దాని చెవిలో పొడిచా. అలా చెయ్యటం వల్ల కుక్కకు బాధ కలుగుతుందని తెలియని వయసది. అదొక పైశాచిక ప్రవృత్తి... అదొక ఆటవిక సంతృప్తి. చెవిలో పుల్లనలా పెట్టానో లేదో ఆ కుక్క గబుక్కున తలపైకెత్తి, నోట్లో వున్న పొడవుపాటి పళ్లన్నింటినీ బయటపెట్టి, నన్ను చీదరించుకుంటూ నా పిక్క పట్టుకుంది. పిక్కలోకి దాని పళ్లు దిగిపోవటం, నరాలు బయటికి రావటం, రక్తం చిమ్మటం కన్నుమూసి కన్ను తెరిచేలోగా అంతా జరిగిపోయింది. బాధతో నేను రాగాలు తియ్యటం మొదలుపెడితే ఇంట్లోంచి అమ్మ గబగబా బయటకు వచ్చింది. అమ్మ వెనకాలే నాన్న- నాన్నని చూడగానే భయంతో నా కడుపులో తిప్పేసింది.... నా ఏడుపు రెట్టింపయింది. అప్పుడు కూడా చీవాట్లు పడ్డాయి నాన్నచేతిలో నాకు. గబగబా నా పిక్కమీద పడిన కుక్కగాటును నాన్న డెట్టాల్‌తో కడిగి, కట్టు కట్టారు ఏదో పొడరేసి. మళ్లీ మామూలే... హోమియో మందులు- నాన్న వేసిన హోమియోమందు మొదటి డోస్‌కే ఆ గాటులోంచి నల్లటినీళ్లు బయటి కొచ్చాయి. నాన్న కరణీకం చేస్తూన్నా ఆయన హోమియోవైద్యంలో మాస్టర్‌డిగ్రీ చేసి, వూళ్లో అందరికీ ఉచితంగా వైద్యం చేసేవాళ్లు. ఆయన హస్తవాసి చాలా మంచిదని... ముఖ్యంగా పిల్లలకి చాలా మంచిదని వూళ్లో వాళ్ల నమ్మకం. మొత్తానికా కుక్కకాటుకి నాన్న మందులేసి తగ్గించారు అక్కర్లేని ప్రతిదాన్లో వేళ్లు పెడతావని నన్ను చీవాట్లు పెట్టి మరీ.

దాదాపు వూళ్లో వున్న జనాలందరూ మా ఇంట్లోనే వున్నారు. నాన్నని ఆ వూరి జనాలందరూ చాలా ప్రేమించేవాళ్లు. ఆయన వృత్తి మూలంగానే కాకుండా ఆయన చేసే వైద్యం మూలంగా అందరికీ ఆయనమీద తగని ప్రేమ. ఆడవాళ్లయితే ఇంక చెప్పక్కర్లా... అందరి కళ్లల్లో ధారలుగా ప్రవహించు తున్నాయి. నాన్నకి ఆడవాళ్లమీద ప్రత్యేకమైన అభిమానం.... కనిపించిన ప్రతివారితోనూ పరాచకా లాడుతూ, నవ్వుతూ కబుర్లు చెప్పి, వాళ్లని తెగ నవ్వించేవాళ్లు. ఆయన పోతే అందుకే వాళ్లు ఆయన్ని మర్చిపోలేకపోతూన్నారు.

కర్మయిపోయింది. వచ్చినవాళ్లందరూ ఎక్కడి వాళ్లక్కడికి వెళ్లిపోయారు అచ్చం మా కుటుంబానికి సంబంధించిన పిల్లలం తప్ప. అమ్మ, అన్నయ్య, వదినావాళ్లు అక్కడుండాల్సినవాళ్లే ఎప్పటికీ.

ఆ రోజు నాన్న ఇనుపబీరువా తెరిచారు అమ్మా, అన్నయ్య. ఆ బీరువా పాతకాలం నాటిది. మూడడుగులకంటే ఎత్తుండదు. బలమైన హాండిల్ వుంటుంది. బ్రిటీష్ కాలంనాటి రాజముద్ర లుంటాయి ఆ బీరువా మీద. దాన్ని నలుగురు మనుషులు కూడా కదిలించడం కష్టమే. అంత బరువుంటుందది. ఏవో దస్తావేజులూ... కాగి తాలూ... ఆస్తులకు సంబంధించిన పత్రాలూ.... ఇంకా పాత కాగితాలు... ఎప్పటివో... తెలుపురంగు పోయి గోధుమరంగులోకి మారిపోయిన కాగి తాలు... డబ్బులు... ఒక్కొక్కటే బయటికి తీస్తూ న్నాడు అన్నయ్య. పెట్టెలో మరికొన్ని కాగితాలు బయటపడ్డాయ్. పొలం, ఇల్లు, తోటలకి సంబంధిం చిన వీలునామా- అన్నీ ఎవరెవరికి ఏదేది ఎంతెంత ఇవ్వాలో వివరంగా రాసివుంచిన వీలునామా అది. దాన్ని చూసి అందరం గొల్లుమన్నాం. ఆయనకి మా అందరిమీదా వున్న ప్రేమని తలచుకుని. అదే వీలునామాలో మాకెవరికీ అర్థంగాని మరొక విషయం వుంది... ఎంతగా అందరం ఆలోచించినా అంతుబట్టలా 'బీమానుంచి వచ్చే పదిహేను లక్షల్లో నా ఆరుగురు పిల్లలకీ తలా ఒక రెండు లక్షలూ... నా భార్యకి మూడు లక్షలు అందాలి'- అమ్మకి కూడా అంతు చిక్కలా ఆ విషయం. ఆయనెప్పుడు బీమా చేసాడో మాకెవరికీ తెలియదు. ఆ బాండ్ కనబడలేదు. నాన్న బీరువాలో మరికొన్ని విలువైన సామాన్లు కనిపించాయి. వాటిల్లో పిల్లలం అందరం ఎవరికి నచ్చినవి వాళ్లం తీసుకున్నాం ఆయన గుర్తుగా. దానిలో నా భాగంగా వచ్చింది ఆయన వెండిపలకల గ్లాసు, ఆయన కళ్లజోడు.

బీరువా మూస్తుండగా ఒక పాతబడిపోయిన కవరు బీరువాలోంచి కిందికి జారింది. అది కాస్త బరువుగానే వుంది. అమ్మ ఆ కవర్ని తీసి అన్నయ్య కిచ్చింది చూడమన్నట్లుగా... కళ్లు తుడుచు కుంటూ... అన్నయ్య ఆ కవర్ని తెరిచాడు. దానిలో బ్లాక్ అండ్ వైట్ క్యాబినేట్ సైజ్ ఫొటో ఒకటి భద్రంగా పెట్టి వుంది. దాన్ని బయటికి తీశాడు అన్నయ్య. మా అందరి కళ్లూ ఆశ్చర్యంతో పెద్దవ య్యాయి. ఆ ఫొటో కాంచనమాలది. అల్చిప్పల్లాంటి ఆమె కళ్లని ఆశ్చర్యంతో పెద్దవయిన మా అందరి కళ్లతో అలాగే చూస్తూండిపోయాం నోటమాట రాకుండా. దాని వెనకాల ఆమె స్వహస్తాలలో రాసివున్నది 'తమ్ముడు అచ్చుకి... ప్రేమతో అక్కయ్య కాంచనమాల'- అని అది చూసిన మేమందరం ఇంకొకసారి గొల్లుమన్నాం నాన్నకి ఆమె మీదున్న ప్రేమాభిమానాలకి.

* * *

చెన్నై... ఇంకా చీకటిగానే వుంది... తెల్లవార లేదు. దూరంనుంచీ వచ్చే కాల్‌లా సింగిల్‌రింగ్ వినబడటంతో అమ్మే అయుంటుందని ఫోన్ దగ్గరకి పరిగెత్తా ఇంతపొద్దున్నే ఎందుకు చేసుంటుందబ్బా అనుకొంటూ.

''కాంచీ... ఇది విన్నావా? నాన్న పదిహేను లక్షలకి ఇన్సూరెన్స్ తీసుకున్నారంట. బాండ్ కూడా కనిపించింది. ఆఫీసర్సెవరో వచ్చి వెళ్లారు నిన్న సాయంకాలం''- అన్న అమ్మ మాటలు వినిపించాయి. ఆ రోజున నాన్న వీలునామాలో ఆఖరిపేరా నా కళ్లలో మెదిలింది. ఆ రోజు అర్థం కాలా మాకెవ్వరికీ.

''పాపమమ్మా నాన్న... చెల్లెలు పెళ్లికి బ్యాంక్‌లో చేసిన అప్పు తీర్చటానికి చాలా ఇబ్బందయిందమ్మా ఆయనకి. చక్కగా ఆరోగ్యంగా వున్న ఆయన సడన్‌గా పోతే అర్థంకాలా నాకు... మనందరికోసం ఆయనంతట ఆయనే మనందరినీ వదిలి వెళ్లిపోయారమ్మా...'' అంటూ బావురుమంది అమ్మ ఫోన్‌లో.

ప్రపంచంలో తల్లి ప్రేమను గురించి మాత్రమే ఎన్నో ఉపమానాలిస్తూంటారు దేవతలతో పోల్చో.... కొవ్వొత్తులతో పోల్చో- మరి ఇలాంటి తండ్రుల గురించి చెప్పుకోవాలంటే ఏ కొలమానాన్ని చెప్పుకోవాలో తెలీక నోటమాట రాలేదు నాకు.

## పాదాల పగుళ్ల నివారణకు



వర్షాకాలంలో ఎక్కువగా నీటిలో నానడం, మురికి నీరు చేరడం మూలంగా బాక్టీరియా ఎక్కువై పాదాలు పగులుతుంటాయి. పాదాలను సరిగ్గా శుభ్రపరచుకోకున్నా పగుళ్లు బారి నొప్పి, మంట వస్తుంది. పాదాల పగుళ్లను, నొప్పులను నివారించాలంటే...

* మర్రిపాలను అరికాళ్లకు, మడమలకు పూసి ఆరాక శుభ్రపరచుకోవాలి.

* కొబ్బరినూనెలో మైనం వేసి కాచి పగుళ్లకు రాస్తే త్వరగా నయమవుతాయి.

* ఆవనూనెలో పసుపు పొడిని కలిపి పాదాలకు పూస్తే పగుళ్లు తగ్గిపోవడమే గాక పాదాలు మృదువుగా అవుతాయి.

* జిల్లేడు పూలు (పచ్చివి) నూరి అరికాళ్లకు కడితే పగుళ్ల మూలంగా వచ్చే నొప్పినుంచి ఉపశమనం లభిస్తుంది.